ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

సోమవారం 24 జూన్ 2024



పెనుకొండలో మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

చివరి రక్తపుబొట్టు వరకు

ప్రజాసేవ చేస్తా

నా తండ్రిని, నన్ను అసెంబ్లీకి పంపిన పెనుకొండ ప్రజల రుణం తీర్చుకుంటా

- నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా
- మా కుటుంబాన్ని నాడు ఎన్టీఆర్.. నేడు చంద్రబాబు గుర్తించారు..
- బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత
- మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు రాక
- అడుగడుగునా అపూర్వ స్వాగతం

పెనుకొండ టౌన్, జూన్ 23: చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవ చేస్తానని రాష్ట్ర బీసీ, ఆర్థిక వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. తన తండ్రి రామచంద్రారెడ్డి, తనను అసెంబ్లీకి పంపిన పెనుకొండ ప్రజల రుణం తీర్చుకుంటానని ఉద్ఘాటించారు. నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానన్నారు. తమ కుటుంబాన్ని టీడీపీ గుర్తించిందన్నారు. అప్పట్లో ఎన్టీఆర్ తన తండ్రికి, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు తనకు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. మంత్రి హోదాలో తొలిసారి ఆదివారం ఆమె జిల్లాకు వచ్చారు. కూటమి శ్రేణులు, అభిమానులు అడుగడుగునా ఆమెకు అపూర్వ స్వాగతం పలికారు. బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి పెనుకొండ దాకా జనమే జనం. గజమాలలతో స్వాగతించారు. పెనుకొండ వీధులు కిక్కిరిసిపోయాయి.



కోడూరుతోపు వద్ద మంత్రికి గజమాల...



సోమందేపల్లిలో మాట్లాడుతున్న మంత్రి సవిత

మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి కవిత పెనుకొండ నియోజకవర్గానికి వచ్చారు. ఆదివారం బెంగళూరు ఎయిర్ పోర్టులో దిగారు. అక్కడికే పెద్దఎత్తున వెళ్లిన శ్రేణులు, అభిమానులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కర్ణాటక సరిహద్దు టోల్‌గేట్ వద్దకు ఉదయం 11.30 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి పాలసముద్రం, సోమందేపల్లి మీదుగా పెనుకొండకు వచ్చారు. అడుగడుగునా మంత్రికి గజమాలలు, క్రేన్లతో యాపిల్ హారాలు వేసి, స్వాగతం పలికారు. ఎన్టీఆర్, వాల్మీకి, కనకదాస విగ్రహాలకు మంత్రి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. అత్యధిక మెజార్టీతో అసెంబ్లీకి పంపిన పెనుకొండ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. బీసీల పార్టీ టీడీపీ అన్నారు. చిన్న పూలవ్యాపారం చేసుకునే తన తండ్రి రామచంద్రారెడ్డిని ఎన్టీఆర్ గుర్తించి, ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి, గెలిచిన తరువాత 14 శాఖలకు మంత్రిగా చేశారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్నిశాఖల మంత్రిగా పనిచేసిన బీసీ నాయకుడు తన తండ్రేనన్నారు. ఆ తర్వాత చంద్రబాబు తమ కుటుంబాన్ని గుర్తించి, తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారన్నారు. భారీ మెజార్టీతో పెనుకొండ ప్రజలు గెలిపించాక మంత్రివర్గంలో చోటు కల్పించారన్నారు. టీడీపీతోనే చేనేతలకు పూర్వవైభవం వస్తుందనీ, అందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. కేంద్రంతో మాట్లాడేందుకు ఢిల్లీ వెళ్లారన్నారు. త్వరలో చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేస్తామనీ, చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడంతోపాటు ముడిసరుకులపై రుణాలు అందజేస్తామన్నారు. వెనుకబడిన తరగతులు సంక్షేమానికి బీసీ కమిషన్ ఏర్పాటు చేసి, అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. 2014-19 సంవత్సరంలో ఉమ్మడి 13 జిల్లాల్లో మంజూరు చేసిన బీసీ భవన్‌ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఆ వర్గాలను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

పెనుకొండలో మంత్రి సవిత ర్యాలీలో టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. పెనుకొండ శ్రీ కృష్ణదేవరాయ వై జంక్షన్ నుంచి పార్టీ కార్యాలయం వరకు వచ్చారు.



నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయం

ఎయిర్‌పోర్ట్ జోన్‌లో

దర్జాగా..!

అనుమతి లేకుండా భవన నిర్మాణం

వైసీపీ జిల్లా కార్యాలయానికి విలువైన స్థలం

అధికారం చేతిలో ఉంది కదా అని అడ్డగోలు నిర్మాణం చేపట్టారు. వైసీపీ జిల్లా కార్యాలయానికి ఏకంగా రూ.20 కోట్ల విలువైన భూమిని కేటాయించారు. పుట్టపర్తి సమీపంలోని సత్యసాయి ఎయిర్ పోర్టు ఎదురుగా.. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టారు. అర ఎకరం విస్తీర్ణంలో ఏడాదిగా చక చకా పనులు సాగుతున్నాయి. పుడా, మున్సిపాలిటీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ.. ఏ ఒక్కరూ ప్రశ్నించలేదు. తాడేపల్లిలో నిర్మిస్తున్న వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని సీఆర్‌డీఏ అధికారులు కూల్చివేయడంతో.. ఇక్కడి భవనం గురించి కూడా చర్చ మొదలైంది.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

అప్పనంగా రెండు ఎకరాలు..

పుట్టపర్తి రెవెన్యూ పొలం సర్వే నంబర్లు 666-6ఏ-1, 7ఏలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీకి 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చారు. ఏడాదికి ఎకరానికి కేవలం రూ.1000 అద్దె చెల్లించేలా జీవో ఇచ్చారు. ఈ భూమి విలువ బహిరంగా మార్కెట్లో ఎకరం రూ.10 కోట్లకుపైగా ఉంటుంది. 2022 ఏప్రిల్ 4న పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడింది. వైసీపీ జిల్లా కార్యాలయానికి అదే ఏడాది మే 18న ప్రభుత్వం భూమిని కేటాయించింది. డిసెంబరు 5న రెవెన్యూ శాఖ వైసీపీకి ఆ భూమిని అప్పగించింది. చిన్నపాటి గుట్ట ఉండే ఆ ప్రాంతాన్ని పుడా (పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అనుమతి లేకుండా చదును చేశారు. ఎయిర్ పోర్టు జోన్ పరిధిలో చిన్న నిర్మాణం చేపట్టాలన్నా అనుమతులు తప్పనిసరి. కానీ పుడా నోరు మెదపలేదు. ఏడాదిగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నా తమకేమీ తెలియదని పుడా అంటోంది. పుట్టపర్తి మున్సిపల్ అధికారులు, ఎయిర్ పోర్టు అథారిటీకే సంబంధమని అంటోంది. అనుమతుల కోసం దరఖాస్తు చేశారా.. లేదా, పుడా అనుమతులు ఇచ్చిందా లేదా అన్నది పరిశీలిస్తున్నామని పుడా వైస్ చైర్మన్ మల్లయ్య అన్నారు.

ఎయిర్‌పోర్ట్ జోన్ అయినా..

వైసీపీ జిల్లా కార్యాలయానికి కేటాయించిన భూమి శ్రీసత్యసాయి విమానాశ్రయం ప్రధాన ద్వారం ముందే ఉంది. పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 2009, ఆగస్టు 18న సత్యసాయి విమానాశ్రాయం, ప్రశాంతి గ్రామంతో ఎయిర్ పోర్టు జోన్ ఏరియా ప్లాన్ రూపొందించింది.. ఎయిర్ పోర్టు రన్‌వే ఏరియాతోపాటు సూచనలు నిబంధనలు, నిర్మాణాలకు నిరాకరణ, అనుమతితో సర్వే నంబర్లను ఇందులో పొందుపరిచారు. వాటిలో వైసీపీకి కేటాయించిన సర్వే నంబర్ 666ను కూడా కనపరిచారు. పుట్టపర్తి ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం. ఇది జిల్లా కేంద్రం కూడా కావడంతో భవిష్యత్తులో విమానాశ్రయాన్ని విస్తరించే ప్రతిపాదన ఉంది. ఈ నేపథ్యంలో ఎయిర్ పోర్టు జోన్ పరిధిలో నిర్మాణాలకు పుడాతోపాటు ఎయిర్ పోర్టు అథారిటీ అనుమతి తప్పనిసరి. భవన నిర్మాణ అనుమతులకు పుడాకు వైసీపీ దరఖాస్తు కూడా చేయలేదు.



పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎయిర్ పోర్ట్ ఏరియా ప్లాన్



మైమరిపించారు..

పుట్టపర్తి, జూన్ 23: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం సాయంత్రం కనువిప్పు పేరిట బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను మైమరపింపజేసింది. గంటపాటు నృత్యం, గానంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

నేడు ప్రజాఫిర్యాదుల

పరిష్కార వేదిక



పుట్టపర్తి, జూన్ 23: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి అధికారం చేపట్టాక మొదటిసారిగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో కార్యక్రమం ఉంటుందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

మంత్రిని కలిసిన

జిల్లా అధికారులు

పెనుకొండ టౌన్, జూన్ 23: మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా జిల్లాకు వచ్చిన సవితను జిల్లా అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు ఉన్నారు.





మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

నాడు వద్దన్నారు.. నేడు ఎగబడుతున్నారు..

- వైసీపీ హయాంలో పురానికి రాం.. రాం.. అన్న ఉద్యోగులు
- కూటమి అధికారంలోకి రావడంతో ఎగబడుతున్న వైనం
- ఒక పోస్టుకు పదిమంది పోటీ.. జోరుగా పైరవీలు
- అన్ని శాఖల్లో ఇదే పరిస్థితి

హిందూపురం, జూన్ 23: వైసీపీ ఐదేళ్ల పాలనలో హిందూపురానికి అధికారులు, ఉద్యోగులు రాం.. రాం.. అన్నారు. ప్రజాప్రతినిధులు పిలిచినా రాలేమని చెప్పేశారు. హిందూపురం రావాలంటే అధికారులు జంకే పరిస్థితి ఉండేది. హిందూపురంలో ఉద్యోగం చేయాలంటే అన్ని శాఖల ఉద్యోగులు ఉత్సాహంగా ముందుకొచ్చేవారు. ఒకప్పుడు హిందూపురం తహసీల్దార్ పోస్టింగ్ కోసం మంత్రి, ముఖ్యమంత్రి పేషీల నుంచి ఒత్తిడి పెట్టేవారు. గత వైసీపీ పాలనలో సీన్ రివర్స్ అయింది. అధికారులు, ఉద్యోగులు పురానికి రావాలంటే జంకే పరిస్థితి ఏర్పడింది. రమ్మని ప్రజాప్రతినిధులే కోరినా వచ్చేవారుకాదు. దీంతో చాలాశాఖల్లో ఇన్‌చార్జి పాలన సాగింది. ఉమ్మడి జిల్లాలో అనంతపురం తర్వాత హిందూపురం పెద్దపట్టణం. వాణిజ్య కేంద్రంగా పేరొందింది. ఒకప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగేది. వైసీపీ పాలనలో అన్ని శాఖలు నిర్వీర్యమయ్యాయి. హిందూపురం నియోజకవర్గంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో కుమ్ములాటలు, వర్గపోరు అధికమైంది. దీంతో అధికారులు ఇక్కడికి రావడానికి జంకేవారు. వర్గపోరులో బలవ్వాల్సి వస్తుందని వారు భయపడేవారు. కొన్ని సందర్భాల్లో అధికారులు రావాలని ఒత్తిళ్లు చేసినా రాలేమంటూ వారు మొహం తిప్పేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో హిందూపురం నియోజకవర్గంలో విధులు నిర్వహించేదుకు అధికారులు మళ్లీ పోటీ పడుతున్నారు. ఒక పోస్టుకు 10 నుంచి 15 మంది పోటీ పడుతున్నారు. దీనిని బట్టి చూస్తే నియోజకవర్గంలో బదిలీ విషయంలో విచిత్ర పరిస్థితి నెలకొందని అధికారులే పేర్కొంటున్నారు.





కూటమి వచ్చాక పైరవీలు

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గెలవడంతో ఇక్కడ అధికార పార్టీలో వర్గపోరు ఉండదనీ, మరీ ముఖ్యంగా ఉద్యోగుల విషయంలో ఒత్తిళ్లు, అడ్డమైన వాటికి తలూపడాలు ఉండవని అధికారులకు తెలిసు. ఈ కారణంగా హిందూపురానికి పోస్టింగ్ కోసం పలుశాఖల అధికారులు పైరవీలు చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటకకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యశాఖల అధికారులతో సైతం ఒత్తిళ్లు పెట్టిస్తున్నట్లు సమాచారం. గత టీడీపీ హయాంలో హిందూపురం నియోజకవర్గంలో ఉన్న స్వేచ్ఛను అధికారులు ఇప్పటికీ నెమరేసుకుంటున్నారు. అడ్డగోలు వ్యవహారాలను ఎమ్మెల్యే బాలకృష్ణ సహించరని ఉద్యోగుల నమ్మకం. 2015లో హిందూపురంలో ఓ భూ పంచాయితీ ద్వారా జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు ఒకరిద్దరు ఇక్కడ కాలు మోపేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న బాలకృష్ణ వారికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. అంతే ఆ తర్వాత హిందూపురం వైపు చూసేందుకు కూడా జిల్లాలోని ప్రజాప్రతినిధులు భయపడేవారు. దీంతో పురాన్ని సేఫ్ జోన్‌గా భావించి, ఇక్కడికి రావడానికి వారివారి స్థాయిలో పైరవీలు చేస్తున్నారు.

ఒక పోస్టుకు పదిమందికిపైగా పోటీ

సాధారణంగా ప్రభుత్వాలు మారినపుడు అధికారులను కూడా మార్చడం ఆనవాయితీ. బదిలీల కోసం ఒక పోస్టుకు ఒకరిద్దరు పోటీ పడటం సహజం. ప్రస్తుతం హిందూపురం నియోజకవర్గంలో పోలీసు శాఖలో పనిచేసేందుకు ఒక్క పోస్టుకు పదిమందికిపైగా పోటీ పడుతున్నారు. హిందూపురం సర్కిల్‌లో నలుగురు సీఐలు ఉండగా.. ఇందులో ఒక్కో పోస్టుకు పంది మందికిపైగా పోటీపడుతున్నారు. హిందూపురం వన్‌టౌన్, రూరల్ సర్కిల్‌లో పోటీ బలంగా ఉంది. రెవెన్యూ శాఖలో మూడు మండలాలకు సంబంధించి అధికారులు ఒక్కో పోస్టుకు ఐదు నుంచి ఎనిమిది మంది వరకు ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించినట్లు సమాచారం. కొంతమంది నాయకుల వెంటపడి ఫలానా పోస్టు తమకే ఇప్పించాలని డిమాండ్ కూడా చేశారు. ఎమ్మెల్యే మాత్రం పనితీరు మెరుగ్గా ఉన్నవారికే తీసుకొస్తున్నట్లు తెలిసింది. పైరవీలు చేసిన అధికారులను కాకుండా స్వయంగా ఎమ్మెల్యే సూచించిన వారినే ఇక్కడికి రప్పిస్తున్నారు. ఇందులో ముందు వరుసలో పోలీసు, రెవెన్యూ, ఎంపీడీఓలు, ఎక్సైజ్, వైద్యశాఖతోపాటు మరికొన్ని విభాగాల్లో పనిచేయడానికి పోటీ పడుతున్నారు.

విచిత్ర పరిస్థితి

నిన్నమొన్నటి వరకు హిందూపురానికి రమ్మని బతిమాలినా రాని అధికారులు కూటమి ప్రభుత్వం వచ్చాక క్యూ కడుతున్నారు. సరిగ్గా 2019 నుంచి 2024 వరకు హిందూపురం నియోజకవర్గంలో విధులు నిర్వహించాలంటే అధికారులు జంకేవారు. ఎందుకంటే ఆ ప్రభుత్వంలో అసాంఘిక కార్యాకలాపాలకు గేట్లు ఎత్తివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వాటికి చెక్ పడింది. పనితీరను బట్టి అధికారులకు పోస్టింగ్ కల్పిస్తున్నట్లు సమాచారం. దీంతో నిన్నమొన్నటి వరకు హిందూపురం అంటే వద్దన్న అధికారులు నేడు రావాలని పైరవీలు చేస్తుండటం గమనార్హం.

అనంతలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటన

- తొలిరోజు జీడిపల్లి రిజర్వాయర్, డ్రిప్ సిస్టం, ఉపాధి పనుల పరిశీలన



ఆత్మకూరు సమీపాన అరటి సాగును పరిశీలిస్తున్న బృందం

అనంతపురం టౌన్/ఆత్మకూరు, జూన్ 23: సివిల్ సర్వీసెస్ 2023బ్యాచ్‌కు ఎంపికైన ఐఏఎస్‌ల బృందం అనంత జిల్లా పర్యటనకు వచ్చింది. ఇందులో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, సీహెచ్ కల్యాణి (కర్నూలు), దామెర హిమవంశీ (చిత్తూరు), పవర్ స్వాప్నిల్ జగన్నాథ్ (గుంటూరు), హెచ్ఎస్ భావన (కాకినాడ), సుభామ్‌నాక్వల్ (ఎన్‌టీఆర్ జిల్లా) ఉన్నారు. ఈ బృందం ఆదివారం ఉదయం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. బెళుగుప్పమండలం రిజర్వాయర్‌కు వెళ్లి అక్కడకు నీరు ఎలా వస్తుంది..? ఎంతమేర వస్తుంది..? తాగు, సాగుకు ఏవిధంగా ఉపయోగపడుతుంది..? తదితర విషయాలను కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత ద్వారా అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రాంత రైతులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలంలో రైతులు డ్రిప్‌ద్వారా సాగుచేసిన అరటి తోటలను పరిశీలించారు. పంటకు పెట్టుబడి, దిగుబడి గురించి రైతులతో అడిగి తెలుసుకున్నారు. అదే మండలంలో మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం రాప్తాడు మండలంలోని హంపాపురం గ్రామంలో ఉపాధి పనుల ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్‌ను పరిశీలించారు. నార్పల మండలంలో పంటల సాగును పరిశీలించి అక్కడనుండి శ్రీసత్యసాయి జిల్లాకేంద్రమైన పుట్టపర్తికి ఐఏఎస్‌ల బృందం వెళ్లింది.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి: రైతులు

ఆత్మకూరు: పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి నూతన ఐఏఎస్‌ల బృందాన్ని రైతులు కోరారు. ఆత్మకూరులో ఫ్రూట్ ప్రాసెసింగ్ కేంద్రం, పండ్లతోటలు, డ్రిప్ పరికరాలను బృందం పరిశీలించింది. అరటి తోటను పరిశీలించారు. బీర పంట సాగుచేసిన రైతు అమర సింహతో పంట సాగు, పెట్టుబడి, దిగుబడి, లాభాలు తదితర విషయాలపై మాట్లాడారు. పంటలు పండిస్తున్న రైతుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతులు బృందాన్ని కోరారు. హార్టికల్చర్ అధికారులు ఫిరోజ్‌ఖాన్, రత్నాకర్, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు బృందం వెంట ఉన్నారు.

1వ తేదీన ఇంటి వద్దకే పెంచన్

- చేనేతకు పూర్వవైభవం తెస్తా
- విలేకరుల సమావేశంలో మంత్రి సవిత

హిందూపురం, జూన్ 23: ఇంటి వద్దకే సామాజిక భద్రత పింఛన్లను జూలై 1 నుంచి పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుయస్, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా సొంత నియోజకవర్గమైన పెనుకొండకు ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా బెంగళూరు ఎయిర్‌పోర్టు వద్ద నుంచి పెనుకొండ వరకు భారీ వాహన శ్రేణితో ర్యాలీగా వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్డీయే కూటమితో రాష్ట్ర ప్రభుత్వం అన్నిరంగాల్లో ముందు వరుసలో వుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తారన్నారు. కూటమి హయాంలో చేనేతలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. చేనేతల బతుకుల్లో వెలుగులు నింపుతామన్నారు. గత టీడీపీ హయాంలో అమలు చేసిన చేనేత సంక్షేమం, రాయతీలు అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తానన్నారు. ఇంత పెద్ద పదవి రావడానికి కారణమైన నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడి వుంటానన్నారు. త్వరలోనే బీసీ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లల్లో వెనుకబడిన విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించే దస్త్రాలపై తొలి సంతకం చేశానన్నారు. ఎన్టీఆర్ విదేశీ విద్య కొనసాగుతుందని 2014 నుంచి 2019 వరకు ఉమ్మడి 13 జిల్లాలకు మంజూరైన బీసీ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. చేనేత, హస్త కళాకారులకు సబ్సిడీ, ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

శ్రమకుతగ్గ ఫలితం దక్కింది

పరిటాల శ్రీరామ్

పెనుకొండ టౌన్, జూన్ 23: అలుపెరుగని పోరాటం చేసిన సవితకు శ్రమకుతగ్గ ఫలితం దక్కిందని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆదివారం మంత్రి సవిత భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తమ ప్రాంతానికి చెందిన మహిళకు మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో బలమైన సామాజికవర్గమైన కురుబలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వడం హర్షణీయమన్నారు. బీసీ హక్కులకోసం సవిత కచ్చితంగా పోరాటం చేస్తారన్నారు. ధర్మవరంలో చేనేతలు అధికంగా ఉన్నారని, వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి సవిత సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో మాధవనాయుడు, రఘువీరాచౌదరి, బాబుల్ రెడ్డి, త్రివేంద, సర్పంచ్ శ్రీనివాసులు వున్నారు.

కొత్తచెరువు వాసికి అరుదైన గౌరవం

ఆసియాస్థాయి వైద్యుల సదస్సులో డాక్టర్ శిల్పాచౌదరికి ప్రథమస్థానం



ప్రశంసాపత్రాన్ని చూపుతున్న డాక్టర్ శిల్పాచౌదరి

కొత్తచెరువు, జూన్ 23: దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా గైనకాలజీ, రోబోటిక్ శస్త్రచికిత్స (ఏఎస్‌జీఆర్ఎస్ 2024) విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పెద్దప్పొళ్ల శిల్పాచౌదరికి అరుదైన గౌవరం లభించింది. శనివారం దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా గైనకాలజీ, రోబోటిక్ శస్త్రచికిత్సలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో ఆమె నిలిచారు. దీంతో ఆ దేశానికి చెందిన వైద్యులు ఆమెకు ప్రశంసాపత్రంతోపాటు అవార్డు అందజేశారు. డాక్టర్ శిల్పాచౌదరి కర్నూలు వైద్యశాలలో వైద్యవిద్యను పూర్తిచేశారు. వారణాసిలోని బెనారెస్ హిందూవిశ్వవిద్యాలయంలో గైనకాలజీ విభాగంలో పీజీ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో గైనకాలజీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెకు కొత్తచెరువు వాసులు అభినందనలు తెలిపారు.

సామాజిక సమస్యలపై సమరమే 'శ్వాసతో యుద్ధం'

- పుస్తకావిష్కరణలో వక్తలు



'శ్వాసతో యుద్ధం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూన్ 23: సామాజిక సమస్యలపై చేసే సమరమే 'శ్వాసతో యుద్ధం' కవితా సంపుటి సారాంశమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కవి మధురశ్రీ రచించిన ఈ కవితా సంపుటి ఆవిష్కరణ సభను ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. మానవత రక్తదాతల సంస్థ అధ్యక్షుడు తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ప్రముఖ రచయిత శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి నారాయణస్వామి మాట్లాడుతూ కవిత్వం, కథ, నవల ఏదైనా సమాజంలో ఎప్పటికప్పుడు మారుతున్న పరిణామాలను బట్టి పరిశీలనా దృష్టి మారుతున్నప్పుడే ఆ సాహిత్యానికి సార్థకత ఉంటుందన్నారు. మధురశ్రీ తన కవిత్వంలో ఇతరులెవరూ స్పృశించని స్పృశించారన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మధురశ్రీ కవిత్వం కాలానికి నిలబడే కవిత్వమన్నారు. మధురశ్రీ మాట్లాడుతూ తనను కవిగా తీర్చిదిద్దిన అనంత నేలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో సాహితీకారులు ఉప్పరపాటి వెంకటేశులు, ఎల్ఆర్ వెంకటరమణ, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, కోశాధికారి కోటిగారి వన్నప్ప, ఉపాధ్యక్షుడు గోసల నారాయణస్వామి, గౌరవ సలహాదారు కంబదూరి షేక్ నబిరసూల్, జెన్నె ఆనంద్‌కుమార్, మిద్దె మురళీకృష్ణ, టీవీ రెడ్డి, నానీల నాగేంద్ర, ఈరన్న, దాసన్నగారి కృష్ణమూర్తి, తూముచర్ల రాజారాం, చం.శాస్త్రి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

1వ తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించేలా చట్టం తేవాలి

ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ



మాట్లాడుతున్న హరికృష్ణ

అనంతపురం విద్య, జూన్ 23: పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియంను కూడా కొనసాగించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపనకు సంబంధించి చట్టబద్ధత తేవాలని కోరారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ వచ్చే వరకు యాజమాన్యం వారీగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా నేరుగా 12వ పీఆర్సీని ప్రకటించాలన్నారు. కర్నూలు జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్నారన్న నెపంతో సస్పెండ్ చేసిన టీచర్లపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా 3 నుంచి 8వ తరగతి వరకు పాఠశాల సహాయకులతోనే బోధన కొనసాగించాలన్నారు. ప్రైమరీ స్కూళ్లు ఉదయం 9.15 గంటలకు, అప్పర్ ప్రైమరీ స్కూళ్లు 9.30గంటలకు, హై స్కూళ్లు 9.40 గంటలకు ప్రారంభమయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి ప్రేమ్‌నాథ్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు శేష ఫణి, నారాయణ నాయక్, నాయకులు బాలసుబ్రహ్మణ్యం, పీవీ శ్రీనివాసులు, గోపాలప్ప, రామలింగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లను కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

అనంతపురం విద్య, జూన్ 23: ఉపాధ్యాయులు సమష్టి కృషితో స్కూళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ సూచించారు. ఆదివారం శారదా స్కూల్‌లో ఆ సంఘం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం జీవో 117ను రద్దు చేయడంతోపాటు, 3,4,5 క్లాసుల విలీనాన్ని కూడా రద్దు చేయాలన్నారు. 1998, 2008 ఎంటీఎస్ టీచర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. టీచర్లకు గుదిబండగా మారిన యాప్స్‌ను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఐదేళ్లుగా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలన్నారు. టీచర్లపై గతంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోను బోధన జరిగేలా చూడాలని, సెకెండరీ స్థాయిలో సమాంతర మీడియం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామప్ప, సరళ, రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ వేరుశనగ పట్టివేత

లారీ సీజ్... 333 బస్తాలు స్వాధీనం

తనకల్లు, జూన్ 23: అక్రమంగా తరలిస్తున్న వేరుశనగ కాయలను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మండలపరిధిలోని బిళ్లూరువాండ్లపల్లి గ్రామం నుంచి అక్రమంగా 333 బస్తాల సబ్సిడీ వేరుశనగ కాయలను తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. ఎస్ఐ ధరణీబాబు వెంటనే బిళ్లూరివాండ్లపల్లి గ్రామానికెళ్లి అక్రమంగా తరలిస్తున్న వేరుశనకాయల వాహనాన్ని పట్టుకున్నారు. విషయాన్ని ఏఓ శ్రీహరినాయక్‌కు సమాచారం అందించారు. ఏఓ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అక్రమంగా తరలిస్తున్న వేరుశనగ కాయలను పరిశీలించి, బస్తాలకు ప్రభుత్వ ట్యాగులుండడంతో ప్రభుత్వ సబ్సిడీకాయలుగా నిర్ధారించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సుబహాన్ రైతుల వద్దనుంచి కొనుగోలు చేసి ప్రొద్దుటూరులోని ఓ ఏజెన్సీకి తరలిస్తున్నట్లు సమాచారం. వేరుశనగ కాయల ఐచర్ లారీని సీజ్ చేసి, కేసు నమోదుచేసి, విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు ఏఓ తెలిపారు.



బిళ్లూరివాండ్లపల్లిలో సబ్సిడీ వేరుశనగ కాయలను వ్యాన్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

ఆయన రూటే వేరు..!

వైసీపీ ప్రజాప్రతినిధులు చెప్పారంటే.. ఇట్టే చేసేవారట

ఆ పార్టీ నాయకులతో అంటకాగుతున్న వైనం

విద్యుత్ శాఖలో ఓ ఉన్నతాధికారి తీరుపై విమర్శలు

అనంతపురంరూరల్, జూన్ 23: ఉమ్మడిజిల్లా విద్యుత్‌శాఖలో ఆయన ఓ ఉన్నతాధికారి. ఉన్నతాధికారి అంటే అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి. పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలి. ఈ అధికారి మాత్రం ఎక్కువగా వైసీపీ ప్రజాప్రతినిధుల సేవలో తరిస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఏ పనైనా సరే వైసీపీ నాయకుల తరువాతే అంటూ ఆయన మాట్లాడటం చూస్తే ఆయన ఏ మేరకు వారి సేవలో తరిస్తున్నారో అర్థమవుతుంది.

ఆది నుంచీ వైసీపీ సేవలోనే..

ఆ ఉన్నతాధికారి గతంలో జిల్లాలోని ఓ డివిజన్ అధికారిగా పనిచేవారు. మూడేళ్ల కిందట జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈక్రమంలో అక్కడకు వెళ్లారు. ఏం జరిగిందో ఏమో తెలియదుకానీ ఆ అధికారి బదిలీ ఉత్తర్వులు మారిపోయాయి. తిరిగి జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందుకు పెద్ద మొత్తంలోనే సంబంధిత ఉన్నతాధికారులకు ముడుపులు ముట్టచెప్పారన్న వాదనలు ఉన్నాయి. జిల్లాకు వచ్చినప్పటి నుంచి ఈయన వ్యవహార శైలి మారిందన్న వాదనలున్నాయి. వైసీపీకి అంటకాగి మరీ పనిచేస్తూ వచ్చారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు ఏది చెబితే వాటిని చేసేవారు. వారు చెప్పిన వారికే పనులు చేసేవారు. వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పైకి మాత్రం సీనియారిటీ అంటూనే నిబంధనలు మరిచి వైసీపీ నాయకుల సిఫారసులకు ప్రాధాన్యత ఇచ్చారని తెలుస్తోంది. మరి ముఖ్యంగా ఓ మాజీ మంత్రి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారిని ఆయా వర్గాల్లో చర్చజరిగింది. వారు ఏది చేబితే అందుకు అనుగుణంగా పనులు చక్కబెట్టేసేవారని ఆశాఖ వర్గాలే పేర్కొంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్ల మంజూరులోనే కాదు సబ్‌స్టేషన్లు, జగనన్న లేఅవుట్ల విషయంలో కూడా ఆయన వ్యవహార శైలి అదేవిధంగా ఉండేదంటున్నారు. కొత్తగా ఏర్పాటైన సబ్‌స్టేషన్లలో వైపీపీ అనుకూల వర్గం సభ్యులకు ఆపరేటర్ పోస్టులు ఇచ్చి నాయకులకు లబ్ధి చేకూర్చేలా పనిచేశారంటున్నారు. ఈ క్రమంలో నాయకులు ఒక్కొక్క ఆపరేటర్ పోస్టు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు సొమ్ముచేసుకున్నట్లు సమాచారం.



విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం

అనుకూలమైన వారిపై చర్యలు శూన్యం

తన శాఖలో కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులు ఎవరైనా సరే ఆయనకు అనుకూలంగా ఉండాల్సిందే. లేదంటే ముప్పుతిప్పలు పేట్టేస్తాడన్న వాదనలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఆయన మాట వినకుంటే కిందిస్థాయి అధికారులు, ఉద్యోగుల మీద ఎవైనా ఫిర్యాదులు రావడం ఆలస్యం.. అంతే ఆఘమేఘాల మీద చర్యలకు ఆదేశాలు ఇచ్చేసేవారంటున్నారు. కొన్ని సందర్భాల్లో సస్పెండ్ చేయడం, లేకుంటే వేతనాలు నిలుపుదలకు సిఫారసులు చేయడం పనిగా పెట్టుకొనేవారంటూ మాట్లాడుకుంటున్నారు. అదే ఆయనకు అనుకూలంగా ఉన్నారంటే వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా పత్రికల్లో కథనాలు వచ్చినా చూసీచూడనట్లు వ్యవహరించేవారన్న వాదనలు లేకపోలేదు. వారి తప్పులను కప్పిపుచ్చే విధంగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం కొసమెరుపు. ఇక ఆయన సామాజిక వర్గానికి సంబంధించి ఎవరు ఎన్ని అక్రమాలకు పాల్పడిన మరింతగా వెనకేసుకునే విధంగా వ్యవహరించేవారని వాదనలు ఆయా వర్గాల్లో ఉన్నాయి. ఎంతో మంది అధికారులు ఆ సీట్లో పనిచేశారు. ఈయనలా వ్యవహరించింది లేదు.. అంటూ ఆ అధికారి తీరుపై ఉద్యోగులు అంటున్నారంటే ఆయన వ్యవహారశైలి ఏంటో అర్థమవుతుంది.

మహాత్మాగాంధీ సమాధి వద్ద ఎంపీ అంబికా నివాళి




అనంతపురం అర్బన్, జూన్ 23: అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీ సమాధి వద్ద ఆదివారం నివాళులర్పించారు. సోమవారం ఆయన పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తారు.

పశువుల సంత ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురంరూరల్, జూన్ 23: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,37,660 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,32,660, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆ వుల సంతతో రూ.1,05,000 ఆదాయం వచ్చిందని తెలిపారు.

అక్విడెక్ట్‌కు గండి కొట్టిన నాన్ ఆయకట్టు రైతులు

విడపనకల్లు, జూన్ 23: జీబీసీకి సాగు నీరు రాక ముందే నాన్ ఆయకట్టు రైతులు 14వ కిలోమీటరు వద్ద హావళిగి పెద్ద వంకకు కాలువ నీటిని మళ్లించుకునే ప్రయత్నాలు చేపట్టారు. గతేడాది కాలువకు సాగునీరు వచ్చిన సమయంలో 14వ కిలోమీటరు వద్ద ఉన్న అక్విడెక్ట్‌కు నాన్ ఆయకట్టు రైతులు మిరప పంటకోసం డ్రిల్లింగ్ మిషన్లతో రంధ్రాలు వేసి సాగు నీరును పెద్ద వంకకు మళ్లించుకు వెళ్లారు. అయితే ప్రస్తుతం ఇంకా జీబీసీకి సాగు నీరు రాలేదు. జూలైలో సాగు నీరు వచ్చే అవకాశాలు ఉండటంతో మిరప రైతులు (నాన్ ఆయకట్టు) వారు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుని అక్విడెక్ట్ కింద భాగంలో రాళ్ల కట్టడాన్ని తొలగించారు. దీంతో కాలువకు సాగు నీరు వస్తే దాదాపుగా ఓ డిస్ట్రిబ్యూటరీకి వెళ్లే అంత సాగు నీరు వంకకు వెళ్తుంది. జీబీసీ కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందక అవస్థలు పడుతారు. ఆరవ కాలువకు చివరి ఆయకట్టుకు చుక్కనీరు వెళ్లే పరిస్థితి ఉండదు. ప్రతి ఏటా హావళిగి, కరకముక్కల, రూపనగుడి, గ్రామాలకు చెందిన నాన్ ఆయకట్టు రైతులు జీబీసీ కాలువ నీటిని హావళిగి పెద్ద వంక ద్వారా తరలించుకు వెళ్తూ ఉన్నారు. ఈసారి మాత్రం ముందుగానే ఆక్విడెక్ట్‌కు ఉన్న రాళ్ల కట్టడాన్ని తొలగించారు.



జీబీసీ అక్విడెక్ట్‌కు కొట్టిన గండి

రోడ్డు గుంతలు పూడ్చిన టీడీపీ నాయకులు


దెబ్బతిన్న రోడ్డుకు మట్టివేయిస్తున్న దృశ్యం

బుక్కపట్నం, జూన్ 23: మండల కేంద్రంలోని నల్లలమ్మ దేవాలయం వద్ద బుక్కపట్నం, ముదిగుబ్బ వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం టీడీపీ నాయకులు స్పందించి ఎక్స్‌కవేటర్‌సాయంతో గుంతలను మట్టితో పూడ్చారు. నాయకులు మాట్లాడుతూ ప్రయాణికులు ఈ రహదారిలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని మట్టితో తాత్కాలికంగా పూడ్చామన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. సామకోటి ఈశ్వరయ్య, జంగం వెంకటరాముడు, దాసరి శ్రీనివాసులు, రెడ్డికేశి, సామకోటి రాజు, ఆటో రాము, నారాయణస్వామి, షామీర్, పుట్ల మోహన్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మవరం, జూన్ 23: తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జూలై 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ పిలుపు నిచ్చారు. చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ధర్మవారానికి ఆయన వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగల జీవితాల్లో మార్పువస్తుందని, మాదిగలకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు, ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాకే మధుసూదన్, ఎంఈఎఫ్ నేతలు కొండప్ప, కొడవండ్ల నారాయణస్వామి, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, శేషు పాల్గొన్నారు.

23వ వార్డులో సమస్యలు పరిష్కరిస్తాం


మహేష్‌ను సన్మానిస్తున్న తెలుగుయువత నాయకులు

ధర్మవరం,జూన్ 23: వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ల సహకారంతో 23వ వార్డులోని సమస్యలను పరిష్కరిస్తానని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ అడ్డా మహేశ్ అన్నారు. వార్డులోని తెలుగుయువత నాయకులు శ్రావణ్, ఇంద్రశేఖర్, గిరి, రాబామమబు, జాబేర్, కౌశిత్, బాష, వెంకీలు అడ్డా మహేశ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. సార్వత్రిక ఎన్నికలలో సత్యకుమార్ యాదవ్ గెలుపునకు తెలుగుయువత నాయకులు చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన కదిరి ఇన్‌చార్జి ప్రసాద్‌కు సన్మానం


భైరవప్రసాద్‌ను సన్మానిస్తున్న గాండ్లపెంట నాయకులు

కదిరి, జూన్ 23: జనసేన కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్‌ను ఆదివారం గాండ్లపెంట మండల కన్వీనర్ రవీంద్రానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గాండ్లపెంట మండలంలోని సోమయాజులపల్లి గ్రామస్థులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడిన చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో విద్యుత్ సమస్యల నెలకొందని, లైన్‌మన్ లేక సక్రమంగా విద్యుత్ సరఫరా కాలేదని గ్రామస్థులు భైరవప్రసాద్‌కు వివరించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పసుపులేటి సురేష్; రాహుల్, అనిల్, రఘు, వెంకటరమణ, ప్రతాప్, వంశీ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ నర్సరీలు..!

- నాసిరకం నారును విక్రయిస్తున్న వైనం
- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని ఉద్యానశాఖ అధికారులు

కొత్తచెరువు, జూన్ 23: జిల్లా వ్యాప్తంగా అక్రమ నర్సరీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ నర్సరీల్లో నాసిరకం మొక్కలు(నారు) రైతులకు విక్రయిస్తూ వ్యాపారులు ముంచుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో పలు నర్సరీల్లో టమోటా, మిరప, వంకాయ నారులను కొనుగోలు చేసి


నర్సరీలో పెంచుతున్న మొక్కలు

నాటి నష్టపోయిన రైతులు కోకొల్లలు. అయితే వీటిని పర్యవేక్షించాల్సిన ఉద్యాన అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు కూడా లేకపోలేదు. దీంతో నర్సరీలు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. జిల్లాలో 300 వరకు నర్సరీలు ఉన్నాయి. ఇందులో కొత్తచెరువు మండల పరిసరాల్లోనే 10 వరకు వెలిశాయి. మండలంలో పదేళ్ల నుంచి ఖరీఫ్, రబీ సీజన్‌లలో టమోటా, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఏటా 8 వేల నుంచి 10 వేల ఎకరాలలో కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. వేరుశనగ, వరి తదితర పంటలు సాగు చేస్తూ నష్టపోతున్న రైతులు కూరగాయల పంటలపై మక్కువ చూపుతున్నారు. వర్షాలు కురవకపోవడం, వ్యవసాయ బావులు, బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోవడంతో చాలా మంది రైతులు ఎకరా, రెండెకరాలు కూరగాయల పంటలసాగుపై దృష్టి సారిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు నర్సరీ వ్యాపారులు నాసిరకం నారును విక్రయిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొంత మంది రైతులు నర్సరీ యజమానులపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఏటా లక్షల్లో వ్యాపారం సాగిస్తూ దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ నర్సరీలపై అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతోనే వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

అనుమతులు తప్పనిసరి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలంటే ఉద్యాన శాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే జిల్లాలో



కొత్తచెరువులోని నర్సరీ

చాలా మంది నర్సరీ వ్యాపారులు అనుమతులు తీసుకోకుండానే ఏర్పాటుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నర్సరీల్లో నాసిరకం టమోటా, మిరప తదితర కూరగాయల మొక్కలను విక్రయిస్తూ లక్షలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు ఏటా పంటలు నష్టపోతూ ఆర్థికంగా దెబ్బతింటున్నారు. అయితే నర్సరీలు నిర్వహణ, మొక్కలపెంపకంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఉద్యాన శాఖఅధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ నర్సరీలపై పర్యవేక్షణ చేస్తూ వాటిపై చర్యలుతీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ నర్సరీలపై చర్యలు తీసుకుంటాం

సత్యసాయి జిల్లాలో ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా నడుపుతున్న నర్సరీలపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. నాసిరకం కూరగాయల మొక్కలు విక్రయిస్తున్న నర్సరీల లైసెన్స్‌లను రద్దు చేస్తాం. నష్టపోయిన రైతులు ఫిర్యాదు చేస్తే ఆ నర్సరీలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

షార్ట్‌సర్క్యూట్‌తో మెకానిక్ షాపు దగ్ధం


షాపులో చెలరేగుతున్న పంటలు

నల్లమాడ, జూన్ 23: మండలకేంద్రంలోని ఓడీసీ, రెడ్డిపల్లి ప్రధాన రహదారిలో రెడ్డిపల్లి గ్రామానికి చెందిన షాకీర్ ఆటోమెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో షాపు దగ్ధమైంది. పాదచారులు, పక్కషాపు వారు గమనించి వెంటనే ఆ షాపు తాళాలు పగులగొట్టి మంటలు ఆర్పివేశారు. షాపు యజమానికి సమాచారం ఇచ్చారు. షాకీర్ షాపు వద్దకు వచ్చి వాటర్ సర్వీసింగ్ మోటారు, పంపు, ఆటో గేర్ బాక్స్‌లు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైన్ తదితరవస్తువులు దగ్ధమైనట్లు తెలిపాడు. వీటి రూ.50వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

కారు, ద్విచక్రవాహనం ఢీ... ఒకరికి గాయాలు

ధర్మవరం, జూన్ 23: పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన పోతలయ్య పనినిమిత్తం ద్విచక్రవాహనంలో ధర్మవరం పట్టణానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం గొట్లూరుకు వెళ్తున్నాడు. ధర్మవరం నుంచి వస్తున్న కారు మార్కెట్‌యార్డ్ వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో పోతలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భార్యాభర్తలు పరస్పరం ఫిర్యాదు

ముదిగుబ్బ, జూన్ 23: మండల కేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో భార్యాభర్తలు ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీటీసీ నాగప్ప కుమారుడు వినోద్ కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు చెందిన వసుంధరతో 2017లో వివాహం జరిగింది. కొన్నిరోజుల తరువాత విభేదాలు వచ్చి ఇద్దరు విడిపోయారని, కోర్టులో విడాకుల కోసం అప్లై చేసుకున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో బంధువుల సమక్షంలో వినోద్ రెండో వివాహం చేసుకున్నాడన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో వినోద్ తమ్ముడి భార్య సీమంతానికి వినోద్ అతని రెండో భార్య వస్తున్నారని తెలుసుకున్న వసుంధర అక్కడికి వెళ్లి పరస్పరం వాదించుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణకు దిగారని పలువురు సర్ది చెప్పడంతో ఇరువురూ పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విడాకులు మంజూరు కాలేదని భార్య తరఫు వారు, విడాకులు మంజూరయ్యాయని భర్త తరపు వారు చెబుతున్నారు. ఇద్దరి ఫిర్యాదులు పరిశీలించి విచారణ చేస్తున్నట్లు సీఐ యతీంద్ర తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి మృతికి నివాళి

నల్లమాడ, జూన్ 23: ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సద్దపల్లి వెంకటరెడ్డి ఆదివారం మృతిచెందారు. అప్పటి నల్లమాడ నియోజకవర్గం ఎమ్మెల్యేగా 1985-89 వరకు పనిచేశారు. మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు నివాళ్లు అర్పించారు. టీడీపీ అభివృద్ధికి వెంకటరెడ్డి ఎన్నలేని కృషి చేశారని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. నీతి, నిజాయితీతో ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, విరుపాక్షరెడ్డి, మహేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ కురబ చెంద్రాయుడు, రషీద్‌ఖాన్, చెరువు చందనబాబు, షరీఫ్‌ఖాన్, మైలే శివశంకర్, కేశవరెడ్డి, సలాంఖాన్, గడ్డం రమణారెడ్డి, బుట్టి నాగభూషణాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాత నిమగ్నం


ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

తనకల్లు, జూన్ 23: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నయ్యారు. ఇటీవల మోస్తరు వర్షాలు కురవడంతో మరోమారు వ్యవసాయ జూదంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి అన్నదాతలు సిద్ధమవుతున్నారు. వర్షాలు పడుతుండడంతో పంటలు బాగా పండుతాయని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. పొలాలను ట్రాక్టర్లు, ఎద్దులతో దుక్కి చేయడం, మరోవైపు పొలాల్లోని చెత్తాచెదారాలను తొలగించి, కాల్చివేస్తున్నారు. విత్తనాలను సమీకరించుకోవడంలో నిమగ్నమయ్యారు.

టీడీపీ నాయకుడు నారాయణ మృతి

గాండ్లపెంట, జూన్ 23: మండలకేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు నారాయణ(45) ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు 12వ తేదీన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా గాండ్లపెంటలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా, విద్యుత్ షాక్ గురయ్యారు. ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా, తిరుపతి, వేలూరు ఆసుపత్రిలో చికిత్సలు పొంది, నాలుగురోజుల క్రితం ఇంటికి వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు చెప్పారు. నారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతిచెందిన విషయం తెలుసుకుని మండల కన్వీనర్ కొండయ్య, వెంకటరమణారెడ్డి, మునాఫ్, లక్ష్మీనరసారెడ్డి, ఆనంద్, నరసింహులు, ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.


నారాయణ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా భగీరథ జయంతి

హిందూపురం, జూన్ 23: పట్టణంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆటో నగర్‌లో ఉన్న భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. హాజరైన ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ.. చిత్తశుద్ధి, అంకితభావంతో లక్ష్యం వైపు చేసే ప్రయత్నం భగీరథ ప్రయత్నం అన్నారు. ఆయన సంతతికి చెందిన సగరులు, ఉప్పరులు సమాజంలో ఆర్థికంగా సమాజికంగా రాణించాలని ఆకాంక్షించారు. మహిళలు ఊరేగింపుగా జ్యోతులను మోసుకొచ్చి భగీరథుడికి సమర్పించారు. నాగరాజు, రమేష్, లింగారెడ్డి, ఉప్పర సంఘం నాయకులు కదిరప్ప వెంకటరమణ, రామప్ప, మహేష్, చాలెంజ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

హిందూపురం అర్బన్, జూన్ 23: పట్టణ పరిధిలోని సత్యనారాయణ పేటలో వెలసిన సత్యనారాయణస్వామికి ఆదివారం కలశాభిషేకం నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో వివిధ అభిషేకాలు, పూజా కార్యక్ర మాలు చేపట్టారు. ఆదివారం కలశాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలవా రుజామున నుంచి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలో కళశాలతో నగరో త్సవం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

వైభవంగా నగర సంకీర్తన

పుట్టపర్తి, జూన్ 23: పట్టణ వీధుల్లో ఆదివారం నగర సంకీర్తనను వైభవంగా నిర్వహించారు. సత్యసాయి పల్లకిని మోస్తూ భక్తిపాటలు ఆలపించారు. సత్యసాయి చిత్రపటాన్ని ఎద్దుల బండిలో ఉంచి ఊరేగించారు. సత్యమ్మ గుడి వద్ద నుంచి ప్రశాంతినిలయం గేటు వరకు నగర సంకీర్తన కొనసాగింది.


ఎద్దుల బండిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు


నగరసంకీర్తనలో పాల్గొన్న భక్తులు

పేదలకు సేవలందించడమే లక్ష్యం

ధర్మవరం, జూన్ 23: పేదలకు సేవలందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని అధ్యక్షుడు గూడూరు మోహన్‌దాసు అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కాచర్ల హనుమంతు జ్ఞాపకార్థం కుమారుడు కాచర్ల నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి 85 మంది హాజరుకాగా ఇందులో 50 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. మెటికల కుళ్లాయప్ప, సురేశ్, గోసేరాధాక్రిష్ణ, ఉట్టిశివప్రసాద్, ముక్తాపురం క్రిష్ణ, పీడీలు రమేశ్‌బాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

వెయ్యి విద్యుత్ సర్వీసులు మంజూరు చేయండి

- విద్యుత్ మంత్రికి ఎమ్మెల్యే రాజు వినతి

మడకశిరటౌన్, జూన్ 23: నియోజక వర్గంలో వెయ్యి కొత్త వ్య వసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను కోరారు. ఆయన ఆదివారం విజయవాడలో విద్యుత్ శాఖ మంత్రి కార్యాలయానికి వెళ్లి మడకశిర నియోజకవర్గం సమస్యలను ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే మూడు రోజుల కిందట టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామితో కలిసి మడకశిరలో విద్యుత్ శాఖాధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వెయ్యి మంది రైతులు కొత్తగా వేసిన వ్యవసాయ బోర్లకు విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వెంటనే కొత్త సర్వీసులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పదిహేను రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలాగే నియోజకవర్గానికి 412 ట్రాన్స్ ఫార్మర్లు అవసరమని, నియోజకవర్గం వ్యాప్తంగా ఆమిదాలగొంది, గుండుమల, గుడిబండ, హిరేతుర్పి, రంగనపల్లి, ఎం రాయాపురం, చిట్నడుకు గ్రామాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లను నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని... అగళి, రొళ్ల మండలాల మధ్య 132 కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హంద్రీనీవా కాలువ పనులు పూర్తిచేస్తాం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

అగళి, జూన్ 23: మడకశిర నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువ పనులను త్వరలోనే చేపట్టి అన్ని చెరువులకు నీరందిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆయాన ఆదివారం అగళి మండలంలోని హంద్రీనీవా కాలువను పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ పనులపై శ్రద్ధ చూపలేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. అందులో భాగంగానే పరిశీలిస్తున్నామన్నారు. చేపట్టాల్సిన కాలువ పనులపై మండ లంలోని స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఆయన వెంట జడ్పీటీసీ ఉమేష్, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

గోరంట్ల, జూన్ 23: మండల సరిహద్దులోని బెంగళూరు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో నారాయణస్వామి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చిలమత్తూరు మండలంలోని తిమ్మాడపల్లికి చెందిన నారాయణస్వామి జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. మంత్రి సవిత నియోజకవర్గానికి ఆదివారం విచ్చేస్తున్న సందర్భంగా ఆమెను స్వాగతించడానికి ద్విచక్రవాహనంలో జాతీయ రహదారిపై తిరుగుతుండగా అదుపు తప్ప డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తీసుకురాగా, డాక్టర్ ఉషా చికిత్సలు చేసి, మెరుగైన చికిత్స కోసం అదే 108లో అనంతపురం తరలించారు.

పాముకాటుతో వృద్ధుడికి అస్వస్థత

గోరంట్ల, జూన్ 23: పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉంటున్న వృద్ధుడు అసల్నా బాషా పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. పట్టణంలోని హిందూపురం ప్రధాన రహధారిలో చిత్రావతి నది ఒడ్డున అసల్నా బాషా చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. దుకాణం వెనుక పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రంగా ఉండడంతో వాటిని తొలగిస్తుండగా, పాము కుడిచేయికి కాటు వేసింది. అస్వస్థతకు గురైన అతన్ని వెంటనే గోరంట్ల ఆసుపత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన వైద్యకోసం ప్రైవేటు వాహనంలో హిందూపురం తరలించారు.

ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, జూన్ 23: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పిలుపు నిచ్చారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం పట్టణంలోని అన్ని వార్డులలో బీజేపీ నాయకులు నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబుళేశు, జింకా చంద్రశేఖర్, గుండా పుల్లయ్య, గోపాల్‌రెడ్డి, నబీరసూల్, కార్తీక్, నరసింహులు, మిర్యాల అంజి, మహాలక్ష్మి, రాధమ్మ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 71వ వర్ధంతిని ఆదివారం కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం ఉంచి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను కొనియాడారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, పసుపులేటి వెంకటేష్, గడ్డం ఓబిరెడ్డి, బిల్లు కుళ్ళాయప్ప, జనసేన మండల కన్వీనర్ గుర్రం జయచంద్ర, మంజునాథ్, టైలర్ దామోదర్, రమేష్, రాజా పాల్గొన్నారు.

పుట్టపర్తి: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి వేడుకలను బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జ్యోతిప్రసాద్, బాలగంగాధర్, రామాంజనేయులు, నారాయణ, సత్యమయ్య పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలకేంద్రంలోని బషీర్ కాంప్లెక్స్ సమీపంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఇంతియాజ్ అహమ్మద్, గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సున్నంపల్లి రంగారెడ్డి ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అశోకప్ప, ఆర్ఎంపీ హరిక్రిష్ణ, నరేష్‌బాబు, వెంకటరమణ, రాజశేఖర్, నాగప్ప, క్రిష్ణప్ప, సీనియర్ నాయకులు గాజుకుంటపల్లి వీరా, సురేష్, రామిరెడ్డి పాల్గొన్నారు.

తాడిమర్రి: బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ధర్మవరం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గంగుల కుంట గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలలో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 2029 ఎన్నికలలో బీజేపీ పోటీ చేసే ప్రతి అభ్యర్థిని గెలిపించుకునే విధంగా బలోపేతం చేసుకుందామన్నారు. నాయకులు సురేశ్‌రెడ్డి, పోతలయ్య, శ్రీనివాసులు, రాము, నీరుగంటి రామాంజనేయులు, పెద్దకోట్ల రమణ పాల్గొన్నారు.


ముదిగుబ్బలో...


నల్లచెరువులో...


ఓబుళదేవరచెరువులో...

దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి, వీరభద్రస్వామి

లేపాక్షి, జూన్ 23: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకులు దుర్గావీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు చేసి, దాతలు అందించిన పూలతో అందంగా అలంకరించారు. అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను అందుకున్నారు.

జూలై 15 నుంచి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు

హిందూపురం అర్బన్, జూన్ 23: పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో జూలై 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లా లక్ష్మీకుమార్, సభ్యులు ధర్మకర్త చింతా గోపాలకృష్ణ, రామమాంజనేయులు, గోపాల్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, భాస్కర్, భార్గవరాముడు తదితరులు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆదివారం విడుదల చేశారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

మడకశిరటౌన్, జూన్ 23: తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో జూలై ఏడో తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కేపీ మధు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం మడకశిర నియోజకవర్గంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. మడకశిరలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏబీసీడీ వర్గీకరణ సాధనే తమ లక్ష్యమని తెలిపారు. ఐదు మండలాల్లో బైక్ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నరసింహులు, నాయకులు రంగనపల్లి రాయుడు, లక్ష్మీనరసప్ప, గోవిందప్ప, గంగాధర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గోరంట్ల, జూన్ 23: మండలంలోని బెంగుళూరు జాతీయ రహదారిపై మండల సరిహద్దులో ద్విచక్రవాహన ప్రమాదంలో నారాయణస్వామి అనే యువకుడు ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు. చిలమత్తూరు మండలంలోని తిమ్మాడపల్లికి చెందిన నారాయణస్వామి పవన్ కళ్యాణ్ అభిమానిగా జనసేన పార్టీలో పనిచేస్తున్నాడు. కూటమి అభ్యర్థిగా గెలుపొందిన మంత్రి సవిత నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఆమెను స్వాగతించడానికి ద్విచక్రవాహనంలో జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. అయితే వాహనం అదుపు తప్ప డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి 108లో తీసుకెళ్లారు. డాక్టర్ ఉష చికిత్సలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం అదే 108లో అనంతపురం తీసుకెళ్లారు.

వృద్ధుడికి పాముకాటు

గోరంట్ల, జూన్ 23: పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉంటున్న వృద్ధుడు అస్లాం బాషా పాము కాటుకు గురై, ఆదివారం అస్వస్థత పొందాడు. పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదిరిలో చిత్రావతి నది ఒడ్డున అస్లాం బాషా చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణం వెనుక పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రంగా ఉండడంతో వాటిని తొలగిస్తుండగా నాగుపాము కుడిచేయిపై కాటు వేసింది. అస్వస్థతకు గురైన అతడిని వెంటనే గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉష చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వాహనంలో హిందూపురం తరలించారు.

దర్గాలో చోరీ

పెనుకొండ, జూన్ 23: పట్టనంలోని గోనిపెంట రోడ్డులో వెలసిన కమ్రుద్దీన్ బాబా దర్గాలో శనివారం రాత్రి దొంగలు పడి హుండీ డబ్బులు దోచుకెళ్లారు. దర్గా నిర్వాహకులు కలీముల్లా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో దొంగలు దర్గా ఎదుట ఉన్న హుండీని పగల కొట్టి అందులో వున్న డబ్బు దోచుకున్నారు. అనంతరం దర్గా తలుపు లు పగలకొట్టి దర్గాలో ప్రవేశించినట్టు సీసీ టీవీ కెమెరా ఫుటేజీల్లో రికార్డు అయిందన్నారు. ఉదయాన్నే దర్గాకు వెళ్లిన నిర్వాహకులు హుండీ పగల కొట్టి ఉండటం గమనించారన్నారు. సీసీ ఫుటేజీ మేరకు పోలీసులు దుండగులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. దర్గా పవిత్రతను భంగం కలిగించే సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు.. పోలీసులను కోరారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

రాప్తాడు, జూన్ 23: మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు కృష్ణమరాజు (37) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను తన రెండు కాళ్లు కోల్పోయాడు. రబ్బరు కాళ్లు అమర్చుకుని జీవనం సాగించేవాడు. అతనికి భార్య లక్ష్మీ, ఒక కుమారుడు, ఒక కూతురు. కుటుంబ పోషణ భారమై తీవ్ర మనస్థాపం చెందిన అతను ఆదివారం జంగాలపల్లి, ప్రసన్నా యపల్లి స్టేషన్‌ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకు న్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతని మృతదేహం పూర్తిగా నుజ్జునుజ్జయిందని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువతి ఆత్మహత్య

బుక్కరాయసముద్రం : తల్లిదండ్రులు మందలించారనే క్షణి కావేశంలో ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం సాయంత్రం చోటు చేసు కుంది. రేగడికొత్తూరు గ్రామానికి చెందిన భాగేశ్వర్‌రెడ్డి, భవానీలకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె పేరు నవ్యశ్రీ (16). ఆదివారం ఓ చిన్న విషయమై తల్లిదండ్రులు నవ్యశ్రీని మంద లించారు. క్షణికావేశంతో ఆమె ఇంటి సమీపంలో ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లి.. ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సేపు అనంతరం గమనించిన తల్లిదండ్రులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



పెనుకొండ వద్ద మంత్రి సవితకు గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు



బాగేపల్లి టోల్‌గేట్ వద్ద కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న మంత్రి సవిత

మంత్రి సవితకు ఘన స్వాగతం

చిలమత్తూరు, జూన్ 23: రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటగా జిల్లాకు వచ్చిన మంత్రి సవితమ్మకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం అపూర్వ స్వాగతం పలికారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన పెనుకొండకు వస్తున్న ఆమెకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లు కుంట అంజినప్పతోపాటు టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆమెను పూల మాలలతో సత్కరించారు. కార్యకర్తలు ఆమెతో కరచాలనం చేశారు. అలాగే కొడికొండ చెక్‌పోస్టు వద్ద అడుగడుగునా పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కోడూరు తోపు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె సంతోష వ్యక్తం చేస్తూ ప్రతిఒక్కరిని అప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా టీడీపీ జిందాబాద్, జై చంద్రబాబు, జై లోకేష్, జై బాలయ్య, మంత్రి సవితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

గోరంట్ల: గోరంట్లలోని పార్టీ కార్యాల యం నుంచి మండలకన్వీనర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాల్లో తరలి వెళ్లి బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అలాగే పార్టీ నాయకులు దేవా నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, బెల్లాల చెరువు చంద్ర, మనోహర్, నరేంద్రరాయల్, అజం తుల్లా, గిరిధర్‌గౌడ్, గంగాధర్ రెడ్డి, బాలక్రిష్ణ, నరేష్, ఉత్తమరెడ్డి, అశోక్, హరి చౌదరి తదితరులు బెంగళూరు విమానాశ్రయనికి వెళ్లి మంత్రికి పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జనసేన జిల్లాకార్యదర్శి సు రేష్, మండలకన్వీనర్ సంతోష్ ఆధ్వర్యంలో మంత్రికి స్వాగతం పలికారు. గోరంట్ల మండలంలోని రెడ్డిచెరువుపల్లి, పాలసముద్రం, జాతీయ రహదారి కూడలిలో గజమాలతో స్వాగతం పలికారు. వార్డు మాజీ సభ్యుడు నాగరాజు ఏర్పాటు చేసిన పండ్ల మొక్కను పాలసముద్రం కూడలిలో మంత్రి నాటారు. నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. పాలసముద్రం నాయకుడు అంబేడ్కర్ చిత్రపటాన్ని మంత్రికి బహూకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.

పెనుకొండ రూరల్: మంత్రి సవితకు స్వాగతం పలికేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెనుకొండలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ సర్కిల్ నుంచి మడకశిర రహదారిలో ఉన్న టీడీపీ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరు వైపులా మంత్రి సవిత, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన, బీజేపీ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

హిందూపురం అర్బన్: మంత్రి సవితకు పరిగి మండల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సవిత అభిమానులు భారీ సంఖ్యలో బాగేపల్లి టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. కొందరు కొడికొండ చెక్‌పోస్టులో ఉన్నారు. ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. పరిగి మండల నాయకులు ప్రవీణ్ రెడ్డి, విష్ణు, వెంకటేష్, ఆదినారాయణ, రామాంజనేయులు తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.



మంత్రికి స్వాగతం పలకడానికి వెళ్తున్న గోరంట్ల మండల నాయకులు

వైశాలి శివయ్య కుటుంబాన్ని పలకరించిన మంత్రి



మంత్రిని సన్మానిస్తున్న శివయ్య

పెనుకొండ టౌన్, జూన్23: మంత్రి సవితకు అత్యంత సన్నిహితుడైన వైశాలి రెసిడెన్స్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకుడు డీకే శివయ్య కుటుంబాన్ని మంత్రి సవిత పరామర్శించారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆమె ఆదివారం తొలిసారిగా పెనుకొండకు వచ్చారు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారి వద్ద వున్న శివయ్య స్వగ్రామానికి వెళ్లి పలకరించారు. మంత్రి సవితకు శివయ్య, ఆయన సతీమణి లక్ష్మి బొకేలు అందించారు. కార్యక్రమంలో రామ్‌పురం ఎంపీటీసీ పద్మావతి తదితరులు ఉన్నారు.

హంద్రీనీవా కాలువ పనులు త్వరలో పూర్తి చేస్తాం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

అగళి, జూన్ 23 : మడకశిర నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువ పనులను త్వరలోనే చేపట్టి అన్ని చెరువులకు నీరందిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆయన ఆదివారం అగళి మండలంలోని హంద్రీనీవా కాలువను పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రినీవా కాలువ పనులపై శ్రద్ధ చూపలేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. అందులో భాగంగానే పరిశీలిస్తున్నామన్నారు. చేపట్టాల్సిన కాలువ పనులపై మండ లంలోని స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఆయన వెంట జడ్పీటీసీ ఉమేష్, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూతప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుడిబండ : మండలంలోని కేఎన్ పల్లికి చెందిన టీడీపీ నాయకులు శని, ఆదివారాల్లో రెండురోజుల పాటు స్థానిక కళారహల్లి జుంజప్పస్వామి, కుర్లహల్లి భూతప్పస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం భూతప్ప స్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి, ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజు గెలుపొందితే స్వామి వారికి మొక్కులు చెల్లిస్తామని అప్పుడు మొక్కుకున్నట్లు నాయకులు తెలిపారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి పూజలు చేయించామన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేప ట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు సురేష్, మంజునాథ్, జడ్పీటీసీ ఉమేష్, రొళ్ల మండల కన్వీనర్ దాసిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

20 మందిపై కేసు

గార్లదిన్నె : మండలంలోని కల్లూరు ఆగ్రహారం గ్రామంలో జరి గిన ఘర్షణలో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. తోపుదుర్తికి చెందిన రాజశేఖర్ ఆగ్రహారంలో ఉన్న బంధువు హనుమంతు ఇంటికి శనివారం వచ్చాడు. రాజశేఖర్‌కు దగ్గర బంధువులైన ప్రభాకర్, కుమార్తె అనుషతో శనివారం రాత్రి ఇరువురికి చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో రాజశేఖర్ తరుపున తోపుదుర్తి గ్రామం నుంచి సుమారు 10 మంది వాహనాల్లో కల్లూరుకు వచ్చి ప్రభా కర్, కుమార్తె అనుషతో గొడవ పడ్డారు. ఈ గొడవలో పలువు రికి గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలకు చెందిన సుమారు 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు గుంతలు పూడ్చిన టీడీపీ నాయకులు

బుక్కపట్నం, జూన్ 23: మండల కేంద్రంలోని నల్లలమ్మ దేవాలయం వద్ద బుక్కపట్నం-ముదిగుబ్బ రహదారి పూర్తిగా దెబ్బతింది. రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం టీడీపీ నాయకులు స్పందించి ఎక్స్‌కవేటర్‌సాయంతో గుంతలను మట్టితో పూడ్చారు. నాయకులు మాట్లాడుతూ ప్రయాణికులు ఈ రహదారిలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని మట్టితో తాత్కాలికంగా పూడ్చామన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. సామకోటి ఈశ్వరయ్య, జంగం వెంకటరాముడు, దాసరి శ్రీనివాసులు, రెడ్డికేశి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి విద్యుత్ సర్వీసులు మంజూరు చేయండి

విద్యుత్ మంత్రికి ఎమ్మెల్యే రాజు వినతి



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూన్ 23: నియోజకవర్గంలో వెయ్యి కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. ఆయన ఆదివారం విజయవాడలో విద్యుత్ శాఖ మంత్రి కా ర్యాలయానికి వెళ్లి మడకశిర నియోజకవర్గం సమస్యలను ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే మూడు రోజుల కిందట టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి మడకశిరలో విద్యుత్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వెయ్యి మంది రైతులు కొత్తగా వేసిన వ్యవసాయ బోర్లకు విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తన దృష్టికి వచ్చిం దని, వెంటనే కొత్త సర్వీసులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పదిహేను రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నియోజకవర్గానికి 412 ట్రాన్స్ ఫార్మర్లు అవసరమని, నియోజకవర్గం వ్యాప్తంగా ఆమిదాలగొంది, గుండుమల, గుడిబండ, హిరేతుర్పి, రంగనపల్లి, ఎం రాయాపురం, చిట్నడుకు గ్రామాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లను నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని... అగళి, రొళ్ల మండలాల మధ్య 132 కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వైభవంగా నగర సంకీర్తన



ఎద్దుల బండిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పుట్టపర్తి, జూన్ 23: పట్టణ వీధుల్లో ఆదివారం నగర సంకీర్తనను వైభవంగా నిర్వహించారు. సత్యసాయి పల్లకిని మోస్తూ భక్తి పాటలు ఆలపించారు. సత్యసాయి చిత్రపటాన్ని ఎద్దులబండిలో ఉంచి ఊరేగించారు. సత్యమ్మ గుడి వద్ద నుంచి ప్రశాంతినిలయం గేటు వరకు నగర సంకీర్తన కొనసాగింది.



నగరసంకీర్తనలో పాల్గొన్న భక్తులు

నేడు కోనలో ఆరాధన మహోత్సవం

చెన్నేకొత్తపల్లి, జూన్ 23: చెన్నేకొత్తపల్లికి సమీపంలోని కోన కణ్వాశ్రమంలో సోమవారం అంజనాదేవి 47వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ మల్లికార్జునస్వామి కణ్వాశ్రమ ఆలయ కమిటి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపూజ, గంగపూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ప్రత్యేక భజన ఉంటుందన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆశ్రమంలో అమ్మవారి ఊరేగింపు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

భార్యాభర్తలు పరస్పరం ఫిర్యాదు

ముదిగుబ్బ, జూన్ 23: మండల కేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో భార్యాభర్తలు ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు పోలీసు లు తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీటీసీ నాగప్ప కుమారుడు వినోద్ కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు చెందిన వసుంధరతో 2017లో వివాహం జరిగిం ది. కొన్నిరోజుల తరువాత విభేదాలు వచ్చి ఇద్దరు విడిపోయారని, కోర్టులో విడాకుల కోసం అప్లై చేసుకున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో బంధువుల సమక్షంలో వినోద్ రెండో వివాహం చేసుకున్నాడన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో వినోద్ తమ్ముడి భార్య సీమంతానికి వినోద్ అతని రెండో భార్య వస్తున్నారని తెలుసుకున్న వసుంధర అక్కడికి వెళ్లి పరస్పరం వాదించుకున్నారు. ఘర్షణకు దిగి, పలువురు సర్ది చెప్పడంతో ఇరువురూ పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విడాకులు మంజూరు కాలేదని భార్య తరపు వారు, విడాకులు మంజూరయ్యాయని భర్త తరపు వారు చెబుతున్నారు. ఇద్దరి ఫిర్యాదులు పరిశీలించి విచారణ చేస్తున్నట్లు సీఐ యతీంద్ర తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



పురంలో ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం, జూన్ 23: ఎంతో మంది జీవితాలకు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తిదాయకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్థంతి సందర్భంగా ఆదివారం బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా రెండు రాజ్యాంగాలు, రెండు జాతీయ జెండాలు, రెండు విధానాలు ఉండకూడదంటూ 1953లో పోరాటం చేసి, దేశం కోసం ధర్మకోసం ప్రాణాలు అర్పించిన గొప్ప దేశభక్తుడు ముఖర్జి అని కొనియాడారు. కాశ్మీర్ రాష్ట్రానికి ఉన్న 360 ఆర్టికల్ రద్దు కోసం పోరాడి అమరుడయ్యారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీడీ పార్థసారథి నగేష్, నరసింహులు, మహేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, జయక్రిష్ణ, అంజినప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తామని బీజేపీ జిల్లా కార్యదర్శి ఎనుముల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని 5వ వార్డులో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు రవి, రామాంజినేయులు, హనుమంతుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



భగీరథుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం అర్బన్, జూన్ 23: పట్టణంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆటోనగర్‌లో ఉన్న భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ.. చిత్తశుద్ధి, అంకిత భావంతో లక్ష్యం వైపు చేసే ప్రయత్నం భగీరథ ప్రయత్నం అన్నారు. ఆయన సంతతికి చెందిన సగరులు, ఉప్పరులు సమాజంలో ఆర్థికంగా సమాజికంగా రాణిం చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మిట్టమీదపల్లి, ఎన్టీఆర్ కాలనీ, సడ్ల పల్లికి చెందిన ఉప్పర, సగర కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహి ళలు ఊరేగింపుగా జ్యోతులను మోసుకొచ్చి భగీరథుడికి సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు, రమేష్, లింగారెడ్డి, ఉప్పర సంఘం నాయకులు కదిరప్ప వెంకటరమణ, రామప్ప, మహేష్, చాలెంజ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతులు మోసుకెళ్తున్న ఉప్పర సగర మహిళలు

సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



కలశాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

హిందూపురం అర్బన్, జూన్ 23: పట్టణ పరిధిలోని సత్యనారాయణ పేటలో వెలసిన సత్యనారాయణస్వామికి ఆదివారం కలశాభిషేకం నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో వివిధ అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం కలశాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలవారుజామున నుంచి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలో కళశాలతో నగరోత్సవం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముళ్ల కంపల మధ్య గ్రామ సచివాలయ పునాదులు



సచివాలయ భవన పునాదులపై పెరిగిన కంపచెట్లు

గుడిబండ, జూన్ 23: మండల పరిధిలోని ముత్తకూరు గ్రామ సచివాలయ భవనం నిర్మాణం పునాదుల వద్దే అర్ధంతరంగా నిలిచిపోయింది. ప్రస్తుతం ముళ్లకంపలతో నిండిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి పునాదులు నిర్మించి వదిలేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులు కుమ్మక్కై భవనం పూర్తి చేయకుండానే సిమెంట్ బిల్లులు డ్రాచేసుకుని, పునాదుల వద్దే నిలిపివేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. ప్రభుత్వం మారింది కావున అధికారులు, ప్రజాప్రతినిదులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని ముత్తకూరు గ్రామస్థులు కోరుతున్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ... ఒకరికి గాయాలు

ధర్మవరం, జూన్ 23: పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని గొట్లూరుకు చెందిన పోతలయ్య పనినిమిత్తం ద్విచక్రవాహనంలో ధర్మవరం పట్టణానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. ధర్మవరం నుంచి వస్తున్న కారు మార్కెట్‌యార్డ్ వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో పోతలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి మృతికి నివాళి

నల్లమాడ, జూన్ 23: ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సద్దపల్లి వెంకటరెడ్డి ఆదివారం మృతిచెందారు. అప్పటి నల్లమాడ నియోజకవర్గం ఎమ్మెల్యేగా 1985-89 వరకు పనిచేశారు. మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ నాయకులు నివాళ్లు అర్పించారు. టీడీపీ అభివృద్ధికి వెంకటరెడ్డి ఎన్నలేని కృషి చేశారని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. నీతి, నిజాయితీతో ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, విరుపాక్షరెడ్డి, మహేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ కురబ చెంద్రాయుడు, రషీద్‌ఖాన్, చెరువు చందనబాబు, షరీఫ్‌ఖాన్, మైలే శివశంకర్, కేశవరెడ్డి, సలాంఖాన్, గడ్డం రమణారెడ్డి, బుట్టి నాగభూషణాయుడు పాల్గొన్నారు.

'ఇక ప్రతి కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం'

పావగడ, జూన్ 23: ఇకనుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోను గాంధీజీ చిత్రపటంతోపాటు అంబేడ్కర్ చిత్రపటం తప్పనిసరిగా పెట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంత్రి వర్గ సమావేశంలో ఆదేశించారు. ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర పర్వదినాల్లో మాత్రమే గాంధీజీ చిత్రపటం పెట్టే వారని, ఇకనుంచి ప్రతి జాతీయ, రాష్ట్ర పర్వదినాల్లో ఇద్దరి చిత్రపటాలను ఉంచాలని ఆదివారం అసెంబ్లీలో ఆయన ఆదేశించారు.

ఎస్టీ సంక్షేమ శాఖాధికారిగా యమున



అధికారి యమునను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూన్ 23: ఎస్టీ సంక్షమ శాఖ తాలూకా అధికారిగా యమున ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తాలూకాలోని సాంఘిక సంక్షేమ కార్యాలయంలో మేనేజర్‌గా వి ధులు నిర్వహిస్తున్న తాను ఉద్యోగోన్నతిపై ఎస్టీ సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆమెకు ఆదివారం పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. తాలూకాలో ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు.